బాబు పెరుగుతున్నాడు. బోర్లపడటం, ప్రాకటం, తప్పటడుగులు వేయడం అన్నీ సుందరికే స్వంతమైనాయి.

ఏడీ భర్త?

అడపా దపా, సెక్రటరీతో రావడం, లేదా, ఏదో పత్రికలో వార్త. అంతే

సుందరికి గుబులెక్కువైంది. భర్తకు తను గుర్తులేదా? దంపతులైన తొలి రోజుల్లో చెప్పుకున్న గుసగుసలు, ఆశలు అన్నీ ఆయన మర్చిపోయ్యాడా?

అందుకే భర్తకు ఉత్తరం వ్రాసింది జవాబు లేదు. గుండె రాయిచేసుకుని కొడుకుతో బయలుదేరింది. భర్త స్టేషన్‌కు రాలేదు. వెతుక్కుంటూ భర్త దగ్గరకు వెళ్ళింది. ఆయన ఇంట్లో లేడు. పి.ఏ. ఉన్నాడు.

"ఎవరండీ మీరు?"

సుందరికి తల కొట్టేసినట్లయింది. తన భర్తయింట్లో తనెవరో చెప్పుకోవాల్సి వచ్చినందుకు

"తెలిసినవాళ్ళమే" అంది. గుండెల్లోంచి వచ్చే దుఃఖాన్ని, అసహాయతను ఆపుకుంటూ.

మూడేళ్ళ బాబూ. తను ఏంచెయ్యాలి?

"అయ్యగారెప్పుడొస్తారు?"

"ఇవుట్‌డోర్ కెళ్ళారు కాశ్మీర్‌కు. యింకో వారందాకా రారు."

నీరసం నిస్సహాయత ఆవరించాయి. దిగాలుపడి కూర్చుండే సుందరి, పి. ఏ. దయదల్చాడు.

"సాయంత్రం అమ్మగారొస్తారు. వారిని కలవండి. మీ కేదన్నా సహాయం చేస్తారు."

సుందరి ఆశ్చర్యపోయింది. తనను బిచ్చగత్తెగా చూసినందుకు, [illegible] ఇంతకూ మరో 'అమ్మ' ఎవరు?

"మీకు తెలియదులెమ్మా. అయ్యగారు అసలు భార్యను వదిలేసి, సినీతార ప్రేమకుమారిని వివాహం చేసుకున్నారు.... ఆవిడ స్టూడియో కెళ్ళారు. సాయంత్రం వస్తారు."

తన ఉత్తరాలు చేరలేదా?

భర్త తనను వదిలేశాడా?

భవిష్యత్తు అంధకారమేనా?

బాబు పాలరాతి గచ్చుమీదపడి ఆడుకుంటున్నాడు. శూన్యమైన భవిష్యత్తుని ఊహించుకుంటూ సుందరి దిగాలుగా కూర్చుంది.

సాయంత్రం దీపాలు పెట్టాక ప్రేమకుమారి వచ్చింది. సుందరిని చూసింది. చూసి "ఏంకావాలి?" అని అడిగింది యధాలాపంగా.

సుందరి మాట్లాడలేదు. అలా వారం గడిపింది పి. ఏ. వచ్చి ఏంకావాలో అడిగి వెడుతుండేవాడు. ప్రేమకుమారి ఏ అర్ధరాత్రో వచ్చి వెడుతుండేది.

నిద్రలేకుండా భవిష్యత్తుని తల్చుకుంటూ, రాంబాబుకోసం ఎదురుచూసింది సుందరి.

